క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



ద్విచక్ర వాహనదారుడికి హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సీట్ బెల్ట్, హెల్మెట్ కచ్చితంగా ధరించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో హెల్మెట్ ధరించడంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో వెళ్లే వారు సీటు బెల్ట్ పెట్టుకుంటే ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. హెల్మెట్ లేకుండా బైకులపై వెళ్తున్న వారిని ఆపి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సీఐ యుగంధర్, ఎస్ఐ జయప్ప ఉన్నారు

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



శ్రీకాళికాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రోఖరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం పోశారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చారు. శ్రీకాళిమాత సేవా సమితి వారు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శశికళ

నంద్యాల(న్యూటౌన్): మానసిక ఒత్తిడిని జయించినప్పుడే విద్యార్థులు విజయం సాధిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శశికళ తెలిపారు. స్థానిక కళాశాలలో మంగళవారం మానసిక ఒత్తిడి, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు మానసిక ఒత్తిళ్లకు గురి అవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒత్తిడిని జయిస్తేనే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. ఎటువంటి మానసిక సమస్యలు ఉన్నా 14416కు సంప్రదించాలని సూచించారు. మనుస్సు ప్రశాంతంగా ఉంటేనే విజయపదం చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు శంకర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఎదుర్కొనే చిన్నచిన్న సమస్యలు, భాగోద్వేగాలను మానసిక ప్రశాంతతోనే దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ వెంకటరామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దూరు ఉన్నతపాఠశాలకు ప్రింటర్ విరాళం



పాఠశాలకు ప్రింటర్ అందజేస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బి.రవీంద్రారెడ్డి

చాగలమర్రి: చాగలమర్రి మండలంలోని మద్దూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.14000 విలువ చేసే ప్రింటర్‌ను పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్, ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి విరాళంగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌బాష తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాత రవీంద్రారెడ్డి, పీఆర్‌టీయూ మండల శాఖ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు రవిశంకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సురేష్‌బాబు, షరీఫ్, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, కవిత పాల్గొన్నారు.

ఆర్టీ‘చీ’ బస్టాండ్





చాగలమర్రి ఆర్‌టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పడిన గుంతలలో నీరు నిలిచి వాగును తలపిస్తున్న దృశ్యం,శిథిలావస్థకు చేరిన ముత్రశాలలు, మరుగుదొడ్లు.

- అధ్వానంగా చాగమర్రి బస్టాండ్
- కానరాని సౌకర్యాలు.. అవస్థలు పడుతున్న ప్రయాణికులు



ఆర్‌టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక పోవడంతో పాత హైవే రోడ్డుపై బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

ఇది చాగలమర్రి బస్టాండ్. చూడటానికి విశాల మైదానంలో కనిపిస్తున్నా సౌకర్యాలు శూన్యం. నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ఇక్కడ ప్రయాణికులకు కూర్చునేందుకు వసతి, మంచినీరు లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా శిథిలావస్థకు చేరాయి.దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట బస్టాండ్ ప్రాంతం చీకటిమయంగా మారుతుండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. దీనికితోడు చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఇలా అనేక సమస్యలకు నిలయంగా మారిన ఈ బస్టాండ్‌లోకి ప్రయాణికులు రావాలంటే జంకుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ అభివృద్ధితో పాటు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. –చాగలమర్రి

అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు వాడాలి



అల్లూరులో రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ : పంటలు సాగు చేసే రైతులు అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులను వాడాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.కొత్తపల్లె, అల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ మినుము, మొక్కజొన్న, సోయాబీన్, వరి పంటల్లో రైతులు సరైన సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వాడరాదన్నారు. కుందూనది తీరం వెంట రైతులు వరి సాగు చేస్తున్నారు. వరి నాటు వేసే సమయంలో నారు కొనలు తుంచి నాటుకోవడం ద్వారా 30 రోజుల వరకు కాండం తొలిచే పురుగు ఆశించదన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రమాదం తప్పింది

- మోడల్ స్కూల్‌లో పైకప్పు పెచ్చులూడిన వైనం



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్ తరగతి గదిలో పెచ్చులూడిన పై కప్పును పరిశీలిస్తున్న ఎంఈఓలు

ఉయ్యాలవాడ : మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రమాదం తప్పింది. రెండు తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడి పడ్డాయి. అయితే, ముందు జాగ్రత్తగా ఉపాధ్యాయులు ఆ గదులకు తాళం వేసి ఉండటంతో ప్రమాదం తప్పింది. మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి ఇంటర్ వరకు 520 మంది విద్యార్థులు చదువుతున్నారు. 26 గదులు ఉండగా పై అంతస్తులో రెండు తరగతి గదులు శిథిలావస్థకు చేరి దెబ్బతిన్నాయి. ఇందులో కూర్చుంటే విద్యార్థులు ఇబ్బంది పడాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు ఇటీవల ఆ గదులకు తాళం వేశారు. అయితే, అల్పపీడనం ప్రభావంతో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ఊహించినట్లుగానే రెండు తరగతి గదుల పైకప్పుల పెచ్చులూడి పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓలు రఘురామిరెడ్డి, వీరప్రతాప్‌రెడ్డిలు మంగళవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తరగతి గదుల సమస్యతో పాటు తాగునీటి సమస్య ఉందని విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

నలుగురు కార్యదర్శులకు పదోన్నతి

ఉయ్యాలవాడ : మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న నలుగురుకి పదోన్నతి లభించినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పుచ్చకాయలపల్లె పంచాయతీ కార్యదర్శి ఉశేనయ్య, తుడుమలదిన్నె కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్వాయిపల్లె కార్యదర్శి రవిప్రకాష్, నర్సిపల్లె కార్యదర్శి మురళీ క్రిష్ణలు గ్రేడ్–5 కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. వీరికి గ్రేడ్–4 హోదాతో పదోన్నతి కల్పించినట్లు వెల్లడించారు.

పకడ్బందీగా బయోమెట్రిక్ డ్రైవ్



చాగలమర్రిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డీఎల్‌డీఓ శివారెడ్డి, సచివాలయ సిబ్బంది

చాగలమర్రి: ఆధార్ కార్డుల జారీకి బయోమెట్రిక్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌డీఓ శివారెడ్డి సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. తల్లిదండ్రుల బయోమెట్రిక్‌తో ఆధార్‌కార్డు పొంది జనన ధ్రువీకరణ పత్రం లేని వారిని గుర్తించి వారికి వ్యక్తిగత ఆధార్ కార్డు, బయోమెట్రిక్‌ను నమోదు చేయాలని సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ అంశంపై సచివాలయ సిబ్బందితో డీఎల్‌డీఓ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మహానంది: అబ్బీపురం గ్రామానికి చెందిన సుధారాణి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సుధారాణి ఈనెల 18న ఉదయం సరుకులు తీసుకొస్తానని అంగడికి వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేక పోవడంతో బాధితురాలి మామ తపిల ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

కూలిన భారీ వృక్షం



మహానంది: వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోపవరం గ్రామంలో ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి భారీ వృక్షం నేల కూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. విద్యుత్ ఏఈ ప్రభాకర్ రెడ్డి సిబ్బందిని పంపించి యథావిధిగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయించారు.

జాగ్రత్తలు పాటించకపోతే దిగుబడులపై ప్రభావం



నీటమునిగిన వరిపైరు

- నీటి నిల్వతో పంటలు కుళ్లిపోయే ప్రమాదం
- అధిక తేమతో పూత, కాయ రాలే అవకాశం
- ఆర్‌ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్

నంద్యాల(అర్బన్): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పంటలు జలమయమయ్యాయి. ఐదారురోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతుండటంతో పైర్లు కుళ్లిపోయే ప్రమాదం నెలకొంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో నల్లరేగడి నేలల్లో ఎక్కువగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, తేలిక పాటి ఎర్రనేలల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. నీటి నిల్వ, అధిక తేమ శాతంతో ఆయా పంటలు కుళ్లిపోవడం, పూత, కాయ రాలడం జరుగుతుంది.ఈ ప్రభావం దిగుబడులపై పడుతుందని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటే సమస్యను అధిగమించవచ్చునని. ఆర్‌ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్ మంగళవారం తెలిపారు. వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఈ సందర్భంగా ఆయన వివరించారు.

- వరిపైరు ప్రస్తుతం నారుమడి దశ నుంచి నాట్లు వేసిన 20 నుంచి 40రోజుల దశలో ఉంది. బీపీటీ 5205, ఇతర రకాలు మూడు నాలుగు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి.
- నీట మునిగిన పొలాలు పుంజుకోవడానికి నారుమడికి యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి. పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ పైపాటుగా వేసుకోవాలి.
- పత్తి పంట 50 నుంచి వందరోజుల దశలో పూత, కాయ ఏర్పడే దశ నుండి మొదటి తీత దశలో ఉంది. పత్తిపంటలో వర్షపునీరు నిలబడితే పిందె, పూత, కాయ రాలిపోవడం, ఆకులు ఎర్రబడి వాడిపోయి రాలిపోవడం జరుగుతుంది.
- పొలంలో నిలబడిన నీటిని తీసి ఎకరాకు 25–30 కిలోల యూరియా, 15–15కిలోల పొటాష్‌ను అదనంగా వేయాలి. వాతావరణం అనుకూలించిన వెంటనే అంతర్ కృషి చేయాలి.
- మినుము పంట ఏపుగా పెరిగే దశ నుంచి కాయ పరిపక్వ దశలో ఉంది. ప్రభావిత పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తీసి ఇనుము లోపాన్ని సరి చేయడానికి ఫెర్రర్స్ సల్ఫేట్ 5.0 గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వారం తర్వాత ఒక శాతం 19:19:19, 1.2 శాతం పొటాషియం నైట్రేట్‌లతో పిచికారీ చేయాలి.
- కాయ ఏర్పడే దశ నుంచి పరిపక్వ దశల్లో వేరు కుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.మీ, ప్రొఫికొనజోల్ ఒక మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కజొన్న పంట 50 నుంచి 60 రోజుల దశలో ఉంది. శాకియా, పూత, గింజ ఏర్పడే దశల్లో ఉన్న మొక్కజొన్న పైర్లలో నీరు నిలిస్తే నష్టం తీవ్రంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ 48 గంటల్లో పొలాల్లో నిలిచిన నీటిని తీసివేయాలి. ఆ తర్వాత పంటపై 2శాతం యూరియా(హెక్టార్లకు 10 కిలోలు, ఒక శాతం పొటాషియం నైట్రేట్‌ను), హెక్టార్‌కు 5 కిలోలు పిచికారీ చేయాలి. అవకాశాన్ని బట్టి డ్రోన్‌ల సాయంతో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయాలి.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్ జైలులో రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి

నంద్యాల(వ్యవసాయం): క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, ఉమ్మడి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి పేర్కొన్నారు. స్థానిక సబ్ జైలును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీల కేసు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్లో కల్పిస్తున్న వసతులు సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే న్యాయవాది ద్వారా ఉచితంగా కోర్టులో వాదించడానికి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరిటెండెంట్ గురుప్రసాద రెడ్డి, న్యాయవాదులు బాలునాయక్, శేష సాయిబాబా, జీవన్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య విభాగం తనిఖీ

పట్టణ శివారులోని శాంతిరాం మెడికల్ కాలేజీ మానసిక వికలాంగుల విభాగాన్ని మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి లీల వెంకట శేషాద్రి, లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మావోనియా కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక వికలాంగులకు న్యాయసహాయం అందించేందుకు ఎల్ఎస్ఎం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వార్డుల్లో మానసిక వికలాంగులను కలిసి వారి ఆరోగ్యం, హాస్పిటల్ కల్పిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాంతిరాం హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్, న్యాయవాదులు జీవన్, శేష సాయిబాబా, వైద్యులు సింధు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 30న స్ఫూర్తి మహాసభ



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): సంచార,అర్ధసంచార, విముక్తి జాతుల అభ్యున్నతి కోసం ఈనెల 30న బీజేపీ ఆధ్వర్యంలో స్ఫూర్తి పేరుతో విజయవాడలో మహాసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం నంద్యాలలోని ఆ పార్టీ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బోయ బాలకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ ఆగస్టు 31 సంచార జాతుల విముక్త జాతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ×సంచార జాతులం.. సదాచార వారసులం సంస్కృతి వారధులం॰ అనే నినాదంతో జరిగే మహాసభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రులు అతిథులుగా హాజరుకానున్నారన్నారు. సంచార కులాల వృత్తులు, కళలు ప్రదర్శించడంతో పాటు కళాకారులు, ఉద్యమ నాయకులకు సత్కరించనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంచార సంఘాల మేధావులు, నాయకులు, కుల పెద్దలు, యువత, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుల నాగరాజు , అశ్విన్ కుమార్, శ్రీధర్ బాబు, బాలవేంకటేశ్వర్లు, బాలముని, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి



మహానంది: శ్రావణమాసం కావడంతో మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడుతుంది. వర్షాలను సైతం లెక్కచేయకుండా భక్తులు మహానందికి వస్తున్నారు. అక్కడికి వచ్చిన భక్తులు మహానందీశ్వర స్వామి దర్శనానికి వస్తుండడంతో భక్తుల సందడి నెలకొంది. భక్తులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

నేడు నందీశ్వరుడికి ప్రదోశకాల అభిషేకం

నందీశ్వర స్వామికి బుధవారం ప్రదోషకాల అభిషేకం ఉంటుందని వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. భక్తులు ఆర్జితసేవ టికెట్ల ద్వారా పూజల్లో పాల్గొనవచ్చన్నారు.

మహానందీశ్వర స్వామిని దర్శనానికి వెళ్తున్న భక్తులు

దివ్యాంగులకు ముప్పు తిప్పలు



రుద్రవరం మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి వెళ్తున్న దివ్యాంగులు



శిరివెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో అప్పీలు చేసుకుంటున్న వికలాంగులు

రుద్రవరం:కూటమి ప్రభుత్వం దివ్యాంగులను ముప్పుతిప్పలు పెడుతోంది. సర్వేలు, రీ సర్వేలంటూ వికలాంగత్వం శాతాన్ని తగ్గించి పింఛన్ ఎగ్గొడుతోంది. రుద్రవరం మండలంలో మొత్తం 703 మంది దివ్యాంగులు పింఛన్ అందుకుంటున్నారు. వీరిలో 78 మందికి 40 శాతం కంటే తక్కువగా వికలాంగత్వం ఉందని పింఛన్‌కు అనర్హులుగా ప్రకటిస్తూ నోటీసులు అందించారు. అలాగే 32 మందికి 90శాతం కంటే తక్కువ వికలాంగత్వం ఉందని రూ.15వేల పింఛన్‌ను రూ.6వేలకే కుదించింది. వీరంతా కూటమి సర్కారు తీరును నిరసిస్తూ మేమేమి చేశాం నేరం అంటూ మంగళవారం మండలకేంద్రంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని కలిసి మొరపెట్టుకున్నారు. గతంలో మాదిరిగానే పింఛన్ అందేలా చూడాలని విన్నవించారు.

- శిరివెళ్ల: మండలంలో గత మూడు రోజుల నుంచి పంచాయతీ కార్యదర్శులు దివ్యాంగులకు వ నోటీసులు ఇస్తున్నారు. తిరిగి వైద్య పరీక్షలు చేయించుకోవాలని లేకపోతే పింఛన్ తొలగింపబడుతుందని చెబుతున్నారు. అన్ని అర్హతలతో దశాబ్దాల నుంచి పింఛన్ తీసుకుంటున్న తమకు ఎందుకు ఇలా వేధిస్తున్నారని ఎంపీడీఓ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. బాధితుల్లో ఎక్కువగా చెవిటి, మూగ, బుద్ధి మాంద్యం, శారీరక వికలాంగులు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సన్మానం



ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ పురస్కార గ్రహీతలతో లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ క్లబ్ కార్యాలయంలో ప్రముఖ ఫొటోగ్రాఫర్లు ఆవుల సుబ్రహ్మణ్యం, బంకా శేషాద్రి రెడ్డి, సయ్యద్ అల్లా బకాష్, కాశీం జవహర్‌లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ పురస్కార గ్రహీతలు అనేక సంవత్సరాలుగా ఫొటోగ్రఫీ రంగంలో విశిష్ట సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రసాద్, నిజాముద్దీన్, తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, అమిదేల జనార్దన్, ప్రసాద్, సభ్యులు కొట్టె చంద్రశేఖర్, బాబురావు, పోసిన సుబ్బారావు, ఇమ్మడి రామ కృష్ణుడు, యూసుఫ్, పవన్, కిశోర్, మేడా చంద్ర శేఖర్, సాయి మనోజ్, రామయ్య, ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వర్షం చేసిన గాయం



గుంతలమయంగా మారిన రహదారి



ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ



దెబ్బతిన్న మినుము పైరు

గోస్పాడు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో పంటలు దెబ్బతిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లగా.. పనులు లేక వ్యవసాయ కూలీలు, ఆటోడ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 95.6 మి.మీ నమోదు కావాల్సి ఉండగా ఇప్పటికే 112.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. జోరుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాల్వలు, కుంటలతో పాటు తెలుగుగంగ, కేసీ, కుందూనదిలో ఉధృతంగా నీటి ప్రవాహం ఉంది. తేళ్లపురి–రాయపాడు గ్రామాల మధ్య వతెనపై నీటి ప్రవాహం అధికం కావడంతో రాకపోకలు నిలిచి ప్రజలకు రవాణాకు అంతరాయంగా మారింది. మండలంలోని పలు రహదారులు వర్షానికి దెబ్బతినడంతో పాటు చిత్తడి మయంగా మారాయి.

ప్రకృతి ప్రకోపం



నంద్యాల(అర్బన్): ప్రకృతి కన్నెర్రజేస్తే వాతావరణ పరిస్థితులు, ప్రజల ఇబ్బందులు ఎలా ఉంటాయో చూపుతూ పట్టణానికి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఊహా చిత్రాన్ని గీచారు. తుఫాన్ ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు విలవిలలాడుతున్నారు. పంటలు దెబ్బతినడంతో రైతులకు అపార నష్టం కలిగింది. వాగులు, వంకలు, నదులు, చెరువులు ఉప్పొంగాయి. కొన్ని చోట్ల రైళ్లు, బస్సుల రాకపోకలు సైతం నిలిచి పోయాయి.ఈ దృశ్యాలు కంటికి కట్టినట్టు మంగళవారం చిత్రరూపం మిచ్చారు కోటేష్.